

యువతకు పిఎం ఇంటర్న్ షిప్

పార్వతీపురం : ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో, బి టెక్ ఉత్తీర్ణులైన వారు, దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 500 కు పైగా ప్రముఖ పరిశ్రమల్ల ఇంటర్నిప్ పొందవచ్చని సూచించారు. నిరుద్యోగుల వయసు 21 నుండి 24 మధ్య ఉండాలని, ఏడాదికి కుటుంబ ఆదాయం రూ.8 లక్షలు లోపు ఉండాలని తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారికి నెలకు రూ. 5,000 స్టైఫండ్ లభిస్తుందని, అలాగే ఒకే మొత్తంగా రూ. 6000 ప్రోత్సాహకాన్ని కూడా అందజేస్తారన్నారు. వివరించారు. వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని సూచించారు.

గిరిజనుల 'చింత' దళారుల చెంత

- జిసిసి కొనుగోలు కేంద్రాలు అంతంత మాత్రమే
- గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం
- దళారుల చేతిలో మోసపోతున్న గిరి రైతులు



గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన సహకార సంస్థ (జిసిసి)ని ఏర్పాటు చేసింది. చింతపండు, అడ్డాకులు, పసుపు, అల్లంతో పాటు పలు రకాల అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారులు, ప్రైవేటు వ్యాపారుల నుంచి గిరిజన రైతులను రక్షించేందుకు జిసిసి ఏర్పాటైంది. అంత వరకు బాగానే ఉన్నా జిసిసి తన లక్ష్యాన్ని మర్చిపోయి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చింతపండు కొనుగోలు కేంద్రాలు అంతంతమాత్రానే ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైంది. దీంతో గిరిజన రైతులు దళారులు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారు. దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తమకు నచ్చిన విధంగా ధర నిర్ణయించి మార్కెట్ కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేసి, మైదాన ప్రాంతానికి తరలించి లాభాలను ఆర్జిస్తున్నారు. ఎంతో కష్టపడి సేకరించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో గిరిజనులు దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా జిసిసి అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరం.

ప్రజాశక్తి - కురుపాం

మండలం కేంద్రమైన కురుపాంలో దళారులు కిలో చింతపండు రూ.45 ధరకు కొనుగోలు చేస్తున్నారు. జిసిసి ద్వారా రూ.36 కొనుగోలు చేస్తున్నారు. జిసిసికి అమ్మితే కిలో దగ్గర రూ.11 గిరిజనులు నష్టపోవస్తుంది. తప్పనిసరి పరిస్థితిలో దళారులను గిరిజన రైతులు ఆశ్రయించాల్సి వస్తుంది. ఇదే అదునుగా దళారులు గ్రామాల్లోకి వెళ్లి చింతపండును కొనుగోలు చేస్తున్నారు. దళారులు జిసిసి కన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నప్పటికీ తూకాల్లో మోసాలు చేస్తున్నారు.

కొందరు వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలు, ధర్మ కాటాలను ఉపయోగించినా అందులోనూ మోసం జరుగుతోంది. చింతపండుకు జిసిసి పూర్తిస్థాయిలో మద్దతు ధర కల్పించకపోవడం కొనుగోలు అంతంత మాత్రం చేయడంతో తప్పని పరిస్థితుల్లో దళారులు, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అమాయిక గిరిజన రైతులు నష్టపోతున్నారు.


పెరిగిన చింతపండు దిగుబడి

గతేడాది కన్నా ఈ ఏడాది చింతపండు దిగుబడి బాగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సగానికి సగం పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. దిగుబడి పెరిగినా చింతపండు ధర మాత్రం పెరగడం లేదని, గత ఏడాది కన్నా ధర తక్కువగా ఉండడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారులే దిక్కు

చింతపండుకు జిసిసి మద్దతు ధర కల్పించలేక కొనుగోలు కూడా అంతంత మాత్రమే చేయడంతో ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులే గిరిజనులకు దిక్కుగా మారుతున్నారు. గిట్టుబాటు ధర లేక పోయినా తూకాల్లో మోసాలు జరుగుతున్నా తప్పని పరిస్థితిలో వారికే విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులంతా నాలుగైదు రోజులు కష్టపడి సేకరించిన చింతపండుకు గిట్టుబాటు ధర రావడం లేదంటూ గిరిజన రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి, జిసిసి కొనుగోలు చేసి అదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

కేజీ చింతపండు రూ.60కు జిసిసి కొనుగోలు చేయాలి




అటవీ ఫల సాయాల కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడం వల్ల గిరిజనులు ప్రైవేట్ దళారుల చేతుల్లో మోసపోతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి జిసిసి ద్వారా కిలో చింతపండు రూ.60కు కొనుగోలు చేయాలి. ప్రతి పంచాయతీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రతిరోజు కొనుగోలు చేసి గిరిజనులను ఆదుకోవాలి.

ఎం.రమణ
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి

నేషనల్ రియల్ హీరో భగత్ సింగ్

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యాన ఘన నివాళి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం/రూరల్

భగత్‌సింగ్ దేశానికి నేషనల్ రియల్ హీరో అని, అతడ్ని నేటి యువతరం ఒక రోల్ మోడల్‌గా భావించి ఆయన ఆశయాలు సాధనకు కృషి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.రాజశేఖర్ కోరారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. తొలుత మండలంలోని నర్సిపురం వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేశారు. హొటల్ శ్రీకాంత్‌లో ఏర్పాటు చేసిన యువకుల సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేశారు. అలాగే చర్చివీధిలోని ప్రముఖ నాస్తిక, హేతువాది యార్ల సూర్యనారాయణ స్థాపించిన భగత్ సింగ్ విగ్రహాన్ని శుభ్రపర్చి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, కె.డేవిడ్, ఎం.వెంకటరమణ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్వాతంత్ర్య సమరయోధులని, వారు మరణించి 94 ఏళ్ళు గడిచినా నేటికీ స్మరిస్తూ వారి సేవలను కొనియాడుతున్నామని చెప్పారు. వారు దేశానికి చేసిన నిస్వార్ధ త్యాగం వృధా పోలేదని గుర్తు చేశారు. 24 ఏళ్ల పిన్న వయసులో ఆయన పోరాట పటిమ వెలకట్టలేనిదన్నారు. సామ్రాజ్యవాదాన్ని తుది ముట్టించాలన్న ఆలోచనే ఆయన్ను హేతువాదిగా, గొప్ప మానవతవాదిగా దేశం కీర్తిస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్యం బ్రిటీష్ వాడి భిక్ష కాకూడదని, అది దేశపౌరుల హక్కుగా ఉండాలని ఆశిస్తూ అహింస మార్గం కన్నా హింస మార్గమే సరైనదిగా భావించి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, భూస్వాముల గుండెల్లో తుపాకుల తూటానౌతానంటూ ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో దేశ యువతకు ఉత్తేజాన్ని నింపిన సమరయోధుడు భగత్ సింగ్ అని కొనియడారు. దేశ విముక్తి కోసం తన విద్య, వివాహ, కుటుంబ సంబంధాలను పూర్తిగా తృణప్రాయం చేసిన త్యాగశీలి అని తెలిపారు. దేశ సౌభ్రాతృత్వమే ధ్యేయంగా బ్రిటీష్ వారిని ఎదిరించి, ఎటువంటి క్షమాభిక్షలకు తావివ్వకుండా చిరునవ్వుతో ఉరికంబమెక్కిన భగత్‌సింగే నేటి యువతరానికి నేషనల్ రియల్ హీరో అని అన్నారు. అటువంటి హీరోని నేటి కార్పొరేట్, మతోన్మాద ఫాసిస్ట్ శక్తులు భగత్‌సింగ్ చిహ్నాన్ని మతోన్మాదిగా, తీవ్రవాదిగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ఆనాటి భగత్‌సింగ్ తెగువ, ధైర్యాన్ని ఈనాటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వం గల మన భారతదేశంలో ఒకే కులం ఒకే మతం నినాదంతో పాలక ప్రభుత్వాలు చేపడుతున్న మారణకాండలకు, మత విద్వేషాలకు యువత బలికావద్దని కోరారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ సంపదను కారు చౌకగా కట్టబెట్టే ప్రభుత్వాలను యువకులు ప్రశ్నించాలని, అక్రమాలు, మోసాలు చేస్తున్న పాలకుల విధానాలను నిలదీయాలని కోరారు. పెట్టుబడిదారీ ప్రలోభాలకు గురికాకుండా బెట్టింగ్‌లకు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిజమైన హీరో అంటే భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయంగా నిలవాలని, భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో అటువంటి కృషి చేపట్టాలని యువకులను కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, ఎస్.ఉమా, సిఐటియు జిల్లా నాయకులు బి.వి.రమణ, డివైఎఫ్ఐ నాయకులు ఎం.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.డేవిడ్, శివ, పలువురు యువకులు పాల్గొన్నారు.



సువర్ణముఖి నదిపై నిర్మాణం మధ్యలో నిలిచిన వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తుప్పపడుతున్న బ్రిడ్జి నిర్మాణ సామగ్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని వెలగవలస వద్ద సువర్ణముఖి నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన నిర్మాణ సామాగ్రి తుప్పుపడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని సిపిఎం నాయకులు విమర్శించారు. ఆదివారం సిపిఎం నాయకులు వెలగవలస వద్ద సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018లో సారిక పంచాయతీ మడవలసకి చెందిన కూనేటి రాజారావు సువర్ణముఖి నదిలో కొట్టుకుపోయి చనిపోయారని, ఆ సందర్భంగా వచ్చిన వ్యతిరేకతతో ప్రభుత్వం 2019 -20లో రూ.8కోట్లతో వంతెన మంజూరు చేసిందని గుర్తు చేశారు. 2020లో వంతెన పనులు ప్రారంభించి 2021 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా నేటికీ పూర్తి కాకుండా మధ్యలో నిలిచిపోయాయని తెలిపారు. దీంతో వంతెన పూర్తి కాకపోవడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణం కోసం తీసుకువచ్చిన సామాగ్రి తుప్పుపట్టిపోతున్నాయన్నారు. ఎన్నికల సందర్భంలో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, నేటి గిరిజన సంక్షేమ మంత్రి వంతెన పూర్తి చేసి రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ నేటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి స్పందించి వంతెన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశీలనలో సిపిఎం నాయకులు సీదరపు అప్పారావు, వంతల సుందర్రావు, మెల్లిక అయోధ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ పిఒ విజయలక్ష్మి తెలిపారు. పట్టణ పరిధిలో మూడు సహాయకుల ఉద్యోగులు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిలో పిఎన్ బొడ్డవలసలో (ఎస్‌సి), వెంకటేశ్వర కాలనీలో (బిసి-బి), గొట్టవు వీధి (ఓపెన్ కేటగిరి) కేంద్రాల్లో ఉద్యోగాలు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా అందజేయాలని ఆమె కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల ఓని రహదారిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను చైర్మన్ పల్లా ప్రతాప్ ఆదివారం సందర్శించారు. పూర్తిగా చెత్త నిండిపోవడంతో సిబ్బందితో అక్కడ చెత్తను లోపలికి ఎత్తించారు. చుట్టుపక్క రైతులకు ఇబ్బంది లేకుండా పనులు చేయించారు. కంపువాసన రాకుండా బీచింగు జల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో ఈ డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అలాగే ఎమ్మెల్యే జయకృష్ణ సాకారంతో శాశ్వత డంపింగ్ యార్డ్‌కు కూడా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న చైర్మన్ ప్రతాప్



కిమ్మిలో మన ఊరుబడినికాపాడుకుందాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు, యుటిఎఫ్ నాయకులు

మన ఊరు బడిని కాపాడుకుందాం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మన ఊరు బడిని కాపాడుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం కిమ్మీ, గడగమ్మ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 25న పార్వతీపురంలో గల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు జరిగే నిరసన ర్యాలీలో గ్రామస్తులంతా పాల్గొనాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కల్చరల్ కమిటీ మెంబర్ కె.గౌర్నాయుడు, జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, జిల్లా కౌన్సిలర్ ఎ.చంద్రమోహన్, కర్రి సింహాచలం, యుటిఎఫ్ మండల కోశాధికారి వాసుదేవరావు, సీతంపేట మండల యుటిఎఫ్ నాయకులు సీల గణేష్, కిమ్మీ గ్రామ సర్పంచ్ జి.రామ్మోహన్‌నాయుడు, కె.రామకృష్ణనాయుడు, ఎస్ఎంసి చైర్మన్ వాన సంతోషమ్మ, గడగమ్మ సర్పంచు ఉదయాన సూర్యనారాయణ, ఎస్ఎంసి వైస్ చైర్మన్ పత్రా దయానంద్, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రక్తదాతకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న రాజన్నదొర

నవోదయ సేవా సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెలంపేట నవోదయా సేవా సంఘం చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. నవోదయా సేవా సంఘంలోని యువకులు గడిచిన ఏడేళ్లు గా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ 8వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. సీతారామ కళ్యాణమండపంలో ఆదివారం మీ సేవకై మేము స్వచ్ఛంద సంస్థ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నవోదయా సేవా సంఘం సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో రక్తదాతలకు ఆయన ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమేనని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, నవోదయా సేవా సంఘం నాయకులు అక్కేన సన్యాసిరావు, వైసిపి జిల్లా కార్యదర్శి మొకర లక్ష్మణరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, మున్సిపల్ విభాగం అధ్యక్షులు కొల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - పాలకొండ

మండల అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని మండల టిడిపి నాయకులు, తంపటాపల్లి ఉపసర్పంచ్ జాడ శ్రీధర్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో మండలంలోని సమస్యలను పట్టించుకోలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే జయకృష్ణ మండలంలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ రహదారులు నిర్మాణానికి దృష్టిపెడుతున్నామన్నారు. ఇందుకు నిదర్శనం అర్తాం, తంపటాపల్లి గ్రామాలకు రహదారుల నిదర్శనం అన్నారు. అలాగే తాగునీటి సమస్యలు లేకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


పింఛన్ల తొలగింపుపై ఆదేశాలు రాలేదు

- మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి
- 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి ముఖాముఖి



పింఛన్ల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పిడి ఎం.సుధారాణి చెప్పారు. విడివికెల ద్వారా మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. తమ శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆమె 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

\- ప్రజాశక్తి, పార్వతీపురం.



◆ పింఛన్ల తొలగింపుపై ప్రభుత్వం నుంచి ఏమైనా మార్గదర్శకాలు ఉన్నాయా?

పింఛన్ల తొలగింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ప్రధానంగా వికలాంగుల పింఛన్లకు సంబంధించిన సర్వే జరిగింది. వారి అంగవైకల్యానికి సంబంధించిన పరిశీలన, విచారణ ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో జరుగుతోంది. వారి నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

◆ జిల్లాలో స్వయం సహాయక సంఘాలెన్ని?మండల సమాఖ్య లెన్ని?

జిల్లాలో 19,866 స్వయంసహాయక సంఘాలు, 565 గ్రామైక్య సంఘాలు, 15 మండల సమాఖ్య లున్నాయి. మొత్తం 2,28,955 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

◆ జిల్లాలో వన్‌దన్ వికాస కేంద్రాలెన్ని? ఏజెన్సీ ప్రాంతంలో వాటి ద్వారా చేపడుతున్న కార్యక్రమాలేమిటి?

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 54 విడివికెలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 33 విడివికెలు వున్నాయి. వీటి ద్వారా గిరిజన మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా చర్యలు చేపడుతున్నాం. ఈ సీజన్‌లో చింతపండు ప్రాసెసింగ్, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వ్యాపారాభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా వ్యాపారవేత్త తయారు కావాలని ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మహిళా వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నాం.

◆ విడివికెలకు నిధులు ఎక్కడ నుంచి వస్తాయి?

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వన్ దన్ వికాస కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

◆ చింతపండు, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

సాలూరులో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, పార్వతీపురం ఎఎంసి మార్కెట్ యార్డులో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. సాలూరులో విడివికెలు సేకరించిన చింతపండు, ఇతర అటవీ ఉత్పత్తుల నిల్వ కోసం మినీ కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశాం. పది మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజ్‌ను రూ.12లక్షల వ్యయంతో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. దీనిలో 75 శాతం సబ్సిడీ, 25 శాతం మహిళా సంఘాల వాటాగా ఉంటుంది.

◆ చింతపండు, జీడి పిక్కల సేకరణపై శిక్షణ ఇస్తున్నారా?

విడివికెల ద్వారా చింతపండు, జీడి పిక్కల సేకరణపై సభ్యులకు అవగాహన కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, పార్వతీపురం, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన విడివికెల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. నాణ్యమైన చింతపండు, జీడి పిక్కల కొనుగోలుపై శిక్షణ కల్పించాం.

◆ మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ద్వారా ఏ మేరకు రుణాలు మంజూరు చేశారు?

జిల్లాలో 5414 మహిళా సంఘాల కు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.332.28 కోట్ల రుణాలు మంజూరు చేశాం. స్త్రీనిధి ద్వారా 8,559మంది మహిళలకు రూ.52.12 కోట్ల రుణాలు మంజూరు చేశాం. ఉన్నతి ద్వారా 557 మంది సభ్యులకు రూ.3.07 కోట్ల రుణాలు అందజేశాం.

ఉపాధి పనులకు వెళ్తే పస్తులేనా?

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామాల్లో వ్యవసాయ కార్మికుల వలసలను నివారించేందుకు వామపక్షాల పోరాట ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం వ్యవసాయ కార్మికులు తమ సొంత ప్రాంతాల్లో పనులు దొరుకుతున్నాయని, వలసలు పోవాల్సిన అవసరం లేదని ఎంతో సంతోషించారు. ఈ చట్టాన్ని నీరుగార్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తుండడంతో ఉపాధి హామీ పనులు చేసిన వేతనదారులకు కూలిడబ్బులు అందక పస్తులుండాల్సి పరిస్థితి నెలకొంది.

మండలంలో సుమారు 29 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఇందులో 17,500మందికి జాబ్ కార్డులు ఉండగా, అందులో 17వేల మంది ప్రతిరోజూ ఉపాధి పనులు చేశారు. వీరికి కనీసం రూ.కోటీ 50లక్షలు చెల్లించాల్సి ఉన్నా, నేటికీ ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులుపడాల్సి వస్తుంది. పనిచేసిన 15 రోజులకు ఒకసారి పేమెంట్లు ఇవ్వాలన్న నిబంధనలున్నా పనులు చేసిన 8 వారాలైనా కూలి సొమ్ము చెల్లించలేదు. కూలిడబ్బులు వస్తాయన్న ఆశతో రోజువారీ నిత్యావసర సరుకులకు అప్పో సప్పో చేసి జీవనం గడుపుతున్నామని, నేటికీ ఈ డబ్బులు అందకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ రోజు పనికి వెళ్తే ఆరోజు పూట గడుస్తుందని, లేకుంటే

ఆరునెలలుగా అందని వేతనాలు
అవస్థలు పడుతున్న కూలీలు

పస్తులేనని కూలీలు వాపోతున్నారు. దీనికితోడు తమ పిల్లల చదువులు, ఇతర అవసరాలకు కూడా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

పని ప్రదేశాల్లో వసతులు కరువు

ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా ఆదిశగా అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదు. ముఖ్యంగా వేసవిలో కూలీలకు మంచినీరు, మజ్జిగ, టెంట్లు, పని ముట్లు అందించాలి. కానీ వీటిని అధికారులు ఇవ్వడంలేదు. ఎండల


ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

తీవ్రతతో చాలా ఇబ్బందులు గురవుతున్నారు. దీనికి తోడు రెండు పూటలా పనిచేయాలన్న నిబంధనతో చాలామంది పనులు కూడా వెళ్లిపరిస్థితి. తీరా ఇబ్బందులు పడి పనులకు వెళ్లినా వేతనాలందక వెళ్లకపోతే జాబుకార్డు పోతుందేమోనని భయంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ప్రతి 15రోజులకు ఒకసారి వేతనాలు వచ్చేవని, ఇప్పుడు మాత్రం 7,8 వారాలవుతున్నా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కూలీలను ఇబ్బందులు పెడితే పనులకు రాకుండా చేసి ఈ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నట్లు కనిపిస్తుందన్న అనుమానాలు కలగక మానదు.

నిధులు విడుదలైన వెంటనే కూలీల ఖాతాల్లో జమ చేస్తాం

ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తాం. ప్రారంభం నుంచి ప్పటి వరకూ కూలీలకు వేతనాలందకపోవడం వాస్తవమే.

రామకృష్ణంనాయుడు, ఎపిఒ, సాలూరు.

వేతనాలందక ఇబ్బందులు పడుతున్నాం

పనులు చేసినా వేతనాలందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పూట గడవడం కష్టంగా ఉంది. కూలి డబ్బులు చెల్లించాలని అధికారులను అడిగితే వస్తాయని చెప్పడమే తప్ప నేటికీ అందలేదు.

కొండతామర నిర్మల, ఉపాధిహామీ వేతనదారు, కొత్తూరు.

నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వడంలేదు

నేను చాలా నిరుపేదను. మా గ్రామంలో ఉపాధి పనులు వెళ్లాను. నెలలు గడుస్తున్నా వేతనం అందడం లేదు. దీంతో రోజు గడవడానికి ఇబ్బందిగా ఉంది.

కొండగొర్రి చిన్నమ్మి, ఉపాధిహామీ వేతనదారు, శివడవలస.

పిల్లలను పోషించుకోడానికి ఇబ్బందిగా ఉంది

మాది ఒడిశా. అక్కడ కూలీ పనులు దొరక్క 15ఏళ్ల క్రితం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ ఉపాధి పనిలో పనులకు నేను, నా భార్య వెళ్తున్నాం. గతంలో ప్రతి 15 రోజులకు ఒకసారి బ్యాంక్ ఖాతాలో డబ్బులు వచ్చేవి, కానీ ఈ సీజన్లో ఒక్కసారి కూడా డబ్బులు రాలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడురున్నాం. పిల్లలకు భోజనం పెట్టడం కూడా కష్టంగా ఉంది.

కొర్ర చిన్నయ్య, ఉపాధిహామీ వేతనదారు, శివడవలస.

కూలీలపై పాలకులు కక్షకట్టడం దారుణం

కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా వారిపై ప్రభుత్వాలు కక్ష కట్టడం చాలా దారుణం. పనులు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించకపోవడం ఇది ప్రభుత్వ అసమర్ధతే. ఇలాగే మరికొద్ది రోజులు కూలీలకు వేతనాలు చెల్లించకపోతే మండలంలో ఉండే కూలీలందరితో కలిపి పోరాటాలు చేస్తాం.

మర్రి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తుంబకొండలో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీ సూర్యకళా దంత వైద్యశాల ఆధ్వర్యంలో సమాజ్ పరివర్తన్ సంస్థ సహకారంతో మండలంలోని తుంబకొండలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్య నిపుణులు పెంటపాటి రాజేష్, పెంటపాటి శశికళ బృందం రోగులకు దంత పరీక్షలు చేశారు. చుట్టుపక్కల పరిసర గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు దంత స్క్రీనింగ్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. శ్రీ సూర్యకళ దంత వైద్యశాల ఆధ్వర్యంలో త్వరలో మండల స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సమాజ్ పరివర్తన్ సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనసేన మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం మాట్లాడుతూ మండలంలో ఇటువంటి వైద్యసేవలు జరగడానికి అన్ని వేళలా తమ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎన్.గణేష్, ఎ.చిన్నారి, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సాహితీ సుధా డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పటల్ సహకారంతో ఆదివారం పట్టణంలో వెంకటరాయిని కోనేరు దగ్గర వైద్య శిబిరం నిర్వహించారు. వందమంది పరీక్షలు చేయించుకున్నారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.స్వప్న హాజరై వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. రోగులను శిబిరానికి బోనుమంతు తిరుపతిరావు, ముంజేటి ఉమామహేష్, ప్రేమ, గున్నయ్య, మహేష్, గోవిందు తదితరులు సహకరించారు.

నేటి నుంచి అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెల 24 (సోమవారం) నుంచి మూడు రోజుల పాటు అంగన్వాడీ కార్యకర్తలుకు పోషణ బి- పడాయి బి (పిల్లలు పోషణ , పూర్వ ప్రాథమిక విద్య)అంశాలపై శిక్షణా తరగతులు జరుగుతాయని సిడిపిఒ బి.అనంత లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరుగుతాయన్నారు.


సభలో మాట్లాడుతున్న ఆర్కె కాలేజీ కరస్పాండెంట్ రామకృష్ణ

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్థానిక ఆర్కె జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పూడి రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక లయిన్స్ కల్యాణ మండపంలో జనహిత, ఆర్కే కళాశాల పేరెంట్స్ డే ఫేర్వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని, అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తద్వారా కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. చక్కని ప్రణాళిక, నిరంతర శ్రమతో విజయం సొంతమవుతుందన్నారు. తమ విద్యాసంస్థల ద్వారా పేద, సామాన్య కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులు ఇంటర్ చదువు కోసం, ఎంసెట్, ఐఐటి, నీట్ తదితర కోచింగ్ కోసం విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆ స్థాయిలో ఇక్కడే తమ విద్యాసంస్థల్లో కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తమ విద్యాసంస్థల ద్వారా పలు ర్యాంకులు సాధించినట్లు ఆయన గుర్తు చేశారు. ర్యాంకు సాధించడానికి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ భూపాల్, అప్పలనాయుడు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్పిఒ రాంప్రసాదరావు

బకాయి వసూళ్లపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఏళ్ల తరబడి పేరుకుపోయిన పెండింగ్ బకాయి వసూళ్లపై దృష్టిపెట్టాలని పాలకొండ డిఎల్పిఒ జె.రాంప్రసాదరావు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం స్థానిక మేజర్ పంచాయతీని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. వీరఘట్టం మేజర్ పంచాయతీకి సంబంధించి రూ.42లక్షలు ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు రూ.27 లక్షలు పైబడి వసూలు చేశామని తెలిపారు. మిగిలిన బకాయి ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యాలు విధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మేజర్ పంచాయతీకి సంబంధించిన వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఇఒపిఆర్డి రమణమూర్తినాయుడు, ఇన్ఛార్జి ఇఒ బి.కోటేశ్వరరావు ఉన్నారు.

చురుగ్గా చేతిపంపు మరమ్మతులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని క్రాస్ ప్రోగ్రాం కింద చేతి పంపు పనులు ఆర్డబ్ల్యుఎస్ మెకానిక్ సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే మండలంలో 400 చేతి పంపులు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం తామరకండి, బగ్గందొర వలస, బళ్ల కృష్ణాపురం తదితర గ్రామాల్లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బోరు మెకానిక్లు కృష్ణ, సత్యనారాయణతో పాటు ఆయా గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.


బోరును బాగు చేస్తున్న మెకానిక్లు

భగత్ సింగ్ ఆశయాన్ని కొనసాగిద్దాం


సాలూరులో భగత్సింగ్కు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

బానిస సంకెళ్ల నుంచి స్వాతంత్ర దిశగా భారతదేశాన్ని నడిపించాల్సిన ఆవశ్యకత ఉందని తన జీవితాన్నే పణంగా పెట్టి పోరాడిన యోధుడు భగత్సింగ్ అని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు కొనియాడారు. ఆదివారము భగత్సింగ్ 94వ వర్ధంతి సభ మండలంలోని జిల్లేడు వలస పంచాయతీ బెల్లపాకలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కులమత బేధాలు, అవినీతి అక్రమాలు, మనిషిని మనిషి దోపిడీ చేయని సమాజం ఏర్పడాలంటే పౌరులంతా బాధ్యతగా సమ సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎన్వై నాయుడు, డివైఎఫ్ఐ గెమ్మెల వెంకటేష్, గిరిజన సంఘం నాయకులు గెమ్మెల జానకీరావు, చిన్నారావు, మోహనరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు పట్టణంలో...

సాలూరు పట్టణంలో డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు సంఘాల నాయకులు భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల పక్షాన పోరాడుతున్న వారికి నిరంతర స్ఫూర్తి భగత్ సింగ్ జీవితం నిలుస్తుందన్నారు. భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించారని ఆ నినాదమే ధైర్యమై ప్రవాహంలా మారి నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే ప్రజల ఆస్తులను కాపాడుకోవడమే నేడు ప్రజలు ముందున్న కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు టి.రాముడు, మహిళా సంఘం నాయకులు జి.స్వప్న, సంధ్య, లక్ష్మి, సిఐటియు నాయకులు ఎన్వై నాయుడు, రాము, హరిబాబు , మీడియా ఇన్ఛార్జ్ టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు కె.సాంబమూర్తి, వెంకటేష్, లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మండలంలోని అంటివలసలో భగత్ సింగ్ 94 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.కార్యక్రమంలో యువతి యువకులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో డివైఎఫ్ఐ నాయకులు డి.ప్రదీప్కుమార్ ఆధ్వర్యంలో సభ జరిగింది. విద్యార్థులు, యువకులు భగత్సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ భగత్సింగ్, రాజ్గురు, సుఖ్దేవ్ యువతకు ఆదర్శప్రాయులన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలర్పించారని, అటువంటి వీరులు త్యాగాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.ప్రసాద్, కె.సంతోష్, వేమల విజయ్. యువజన సంఘం నాయకులు పి.ఉమామహేశ్వరరావు, పి.సూర్యనారాయణ డి.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.


కొమరాడ, పాచిపెంటలో భగత్సింగ్కు నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



బలిజిపేట: భగత్సింగ్కు నివాళ్లు అర్పిస్తున్న పెదపెంకి గ్రామస్తులు

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో భగత్ సింగ్ వర్ధంతి నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భగత్సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అలర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా ఉల్లాస్ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

ఉల్లాస్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా రాత్రి బడుల్లో విద్య నేర్చుకున్న వెలుగు మహిళలకు జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కురుపాం మండలంలో ఎపిఎం బి.వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ పరీక్షా కేంద్రాలను ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి గుమ్మ, పి.లేవిడి పరీక్ష కేంద్రాలను ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎపిఎం వెంకట్ కురుపాం, కస్పాగదబవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను సందర్శించి మహిళలు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మండలంలో 90 కేంద్రాల్లో 1530 మంది మహిళలు అక్షరాస్యత పరీక్ష ను రాశారని, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మహిళలు ఓపెన్ స్కూల్కు చదవడానికి అర్హత పొందుతారని అన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. ఈమేరకు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 42 కేంద్రాల్లో 1430 గాను 1365 మందికి అక్షరాస్యత అర్హత పరీక్షను ఎపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇఒపిఆర్డి ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎపిఎం ఆధ్వర్యాన పరీక్షా కేంద్రాలన పరిశీలించారు. పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా అంగన్వాడి వర్కర్లు వ్యవహరించారు.. అనంతరం ఎపిఎం శ్రీరాములు మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షల్లో 33 శాతం పొందిన వారిని ఉత్తీర్ణులుగా గుర్తించి వారికి ఎన్ఐఒఎస్ ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిసిలు ఆనంద్, ప్రసాద్, సత్యనారాయణ,


సీతానగరంలో పరీక్ష రాస్తున్న మహిళలు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కురుపాం ఎంపిడిఒ ఉమామహేశ్వరి

వసంత్, మోహన్తో పాటు ఉల్లాస్ వాలంటీర్లు, అంగన్వాడీ సిబ్బంది, విఒఎలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో ఉల్లాస్ పరీక్షలు 69 కేంద్రాల్లో 1760 మంది అభ్యాసకులకు 1734 మంది హాజరయ్యారు. ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎపిఎం కమల కుమారి, గొయిది, సోమగండి, సీతంపేట అంగన్వాడీ సెంటర్లలో పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

వీరఘట్టం: మండలంలోని 49 కేంద్రాల్లో ఉల్లాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో 1310 మంది వయోజనులు పరీక్ష రాసినట్లు ఎపిఎం కె.రాము తెలిపారు. ఈ పరీక్షకు అంగన్వాడీ కార్యకర్తలు ఇన్విజిలేటర్గా వ్యవహరించినట్టు ఆయన తెలిపారు.

పాచిపెంట: మండలంలోని వెలుగు ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకంలో భాగంగా పలువురు వయోజనాలకు అక్షరాస్యత పరీక్షా నిర్వహించడం జరిగింది .మండలంలో 58 గ్రామాలలో 72 పరీక్షా కేంద్రాల్లో పరీక్షా నిర్వహించగా 1344 మంది హాజరయ్యారు. అంగన్వాడీ కార్యకర్తలు ఇన్విజిలేటర్గా వ్యవహరించినట్టు ఎంపిడిఒ బివిజె పాత్రో తెలిపారు.

గరుగుబిల్లి: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 35 కేంద్రాలలో అక్షరాస్యత అర్హత పరీక్ష జరిగాయి. ఉల్లిభద్ర, గొట్టివలస,తదితర గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖ ఎడి వైకుంఠరావు, ఉల్లాస్ కార్యక్రమం నోడల్ అధికారి రమా జ్యోతి, ఎంపిడిఒ జి పైడితల్లి, ఎపిఎం పి.అప్పలనాయుడు పరిశీలించారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా అంగన్వాడీ వర్కర్లు వ్యవహరించారు. కార్యక్రమంలో సిసిలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి.చంద్రమోహన్, మరియదా సు, విఒఎలు, పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద ధర్నా : సిపిఐ

ప్రజాశక్తి - సీతంపేట

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేదవానికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం, ఇందుకు రూ 5 లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా పేదలకు ఇళ్ల మంజూరు విషయమై పట్టించుకోలేదని విమర్శించారు. కావున ఇళ్ల మంజూరు కోసం చేస్తున్న కలెక్టర్ వద్ద ధర్నాకు పేదలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

గొయ్యి కప్పరు... భవనం నిర్మించరు...

ప్రమాదకరంగా మారిన గుంత

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వీధిలో డిజిటల్ లైబ్రరీ భవనం నిర్మించేందుకు తవ్వకాలు జరిపారని, అయితే ఇప్పటికీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని మండలంలోని చలివేంద్రి గ్రామస్తులు తెలిపారు. తవ్విన గొయ్యి కప్పండి లేదా భవన నిర్మాణ పనులు చేపట్టండని అధికారులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో డిజిటల్ లైబ్రరీ భవనం నిర్మాణ పనులు చేపట్టేందుకు తవ్వకాలు జరిపారు. ఇక్కడ నేటికీ ఏ విధమైన పనులు చేపట్టకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంతో ప్రస్తుతం ఆ గొయ్యి ప్రమాదకరంగా మారిందన్నారు. ఇటీవల కాలంలో భవనమైన నిర్మించండి.. గొయ్యి అయినా కప్పి వేయండి అంటూ ఎంపిడిఒ బి.వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లామని గ్రామస్తులు తెలిపారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

యువత శ్రమదానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ముచ్చర్ల వీధికి చెందిన కొంతమంది యువకులు ఏకమై ఆదివారం వంతెనపై ఉన్న మట్టిని తొలగించారు. చిన్నపాటి చినుకు పడినా వర్షం నీరంతా వంతెనపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వంతెనకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, పలుమార్లు రోడ్లు, భవనాల శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. మూడు నెలల కిందట ఇదే గ్రామంలో మందిర వీధికి చెందిన కొంతమంది యువకులు శ్రమదానం చేశారు. యువత ఏకమై శ్రమదానం చేయడంతో అధికారులకు సిగ్గు వచ్చే పరిస్థితి చేశారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శ్రమదానం చేస్తున్న యువకులు

రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ

సామాజిక ఉద్యమాలతో సాధించుకుందాం

రెల్లి సామాజికవర్గ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - పాలకొండ

రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సి వర్గీకరణ జరిగిందని, దీన్ని సామాజిక ఉద్యమాలతో సాధించుకుందామని రెల్లి ఆసమాజికవర్గ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ పిలుపునిచ్చారు. పాలకొండ డివిజన్లోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు స్థానిక రెల్లివీధిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడారు. రెల్లి సామాజికవర్గానికి ఎబిసిడి వర్గీకరణలో అన్యాయం జరిగిందని జస్టిస్ రామచంద్రన్, ఉషమెహ్రా కమిషన్ చెప్పాయన్నారు. రెల్లి జాతి చాలా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న కమిషన్ దృష్టిలో పెట్టినా రెల్లిలకు ఐదు శాతం పెట్టడం జరిగిందన్నారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాబా లెక్కల ప్రకారం విభజన జరిగిందని, ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం జిల్లాల వారీగా విభజన జరిగితే రెల్లిలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇలా జరగకపోతే న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మజ్జి బాబ్జీ, పాలకొండ డివిజన్ కార్యదర్శి బెవర శివ ప్రసాద్, స్థానిక నాయకులు ఆకుల కుమార్, పిన్నింటి అప్పన్న, శ్రీకాకుళం జిల్లా నాయకులూ అర్జీ ఈశ్వరరావు, సుధాకర్ మాస్టర్, బొమ్మాళి గుమ్మయ్య, బొమ్మాళి సుధాకర్, లోకొండ గణేష్ మాస్టర్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గేదె యజమానికి నష్టపరిహారం ఇప్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యుత్ షాక్తో మృతి చెందిన పాడి గేదె యజమానికి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీనగర్లో గల అగ్ని గంగమ్మ గుడి దగ్గర విద్యుత్ స్తంభం వైరు తెగి గేదె మీద పడడంతో గేదె అక్కడికక్కడే చనిపోయింది. సంఘటనా స్థలానికి సిపిఎం నాయకులు చేరుకుని పాడిగేదె యజమానితో మాట్లాడారు. గేదె విలువ సుమారు రూ. 80వేలు ఉందని, గేదె మృతితో రోజువారి భృతి కోల్పోయి నష్టపోయాడని యజమాని శ్రీనివాసరావుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే ప్రమాదాలు జరగకుండా విద్యుత్శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు

లారీ ఢీకొని దంపతులు దుర్మరణం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని బైపాస్ రోడ్డు జంక్షన్ లో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. కూలిపనులు ముగించుకుని నెలిపర్తి పంచాయతీ వంగరగుడ్డివలస గ్రామానికి మజ్జి రాము(57), భార్య గురిబారి(47) మోటార్ సైకిల్పై వెళ్తుండగా ఒడిశా నుంచి రామభద్రపురం వైపు వెళుతున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. ఒడిశా నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన వీరు వంగరగుడ్డివలసలో స్థిరపడ్డారు. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేయడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై పట్టణ సిఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని మరుపెంట శివార్లలోని తోటపల్లి కుడి కాలువ వంతెన సమీపాన నీటిలో తేలియాడుతున్న 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి పంపించామన్నారు.